క్లుప్తంగా

కార్మెల్‌మాతను దర్శించుకున్న భక్తులు



ఫిరంగిపురం: మండలకేంద్రంలోని కార్మెల్‌మాతను దర్శించుకునేందుకు పలుప్రాంతాలనుంచి ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పొద్దుటూరు, దర్శి, ధర్మవరం, కర్నూలు, మార్కాపురం ప్రాంతాలను పలు వాహనాలు, రైళ్లలో తరలి వచ్చారు. కొండ ఎక్కి తలనీలాలు సమర్పించారు. కార్మెల్‌మాత మందిరంలో కొవ్వొత్తులు వెలిగించి, కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు.

చిలువూరులో ఉచిత వైద్యశిబిరం



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చిలువూరు గ్రామంలో ఆదివారం రావ్స్ బాండ్స్ ఆఫ్ లవ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో కొప్పుల అనిల్ బాబు జ్ఞాపకార్థం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈ శిబిరంలో 130 మందికి గుండె సంబంధిత వ్యాధులకు, ఎముకలు, కీళ్లు, సాధారణ వ్యాధులు, క్యాన్సర్ నిర్ధారణ, కంటి వ్యాధులకు పరీక్షలు నిర్వహించామని తెలిపారు. విజయవాడ సెంటినీ, గుంటూరు బొమ్మిడాల క్యాన్సర్ హాస్పిటల్, అమరావతి డెంటల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో వైద్యసేవలు అందించామన్నారు. షుగర్, బీపీ, ఊపిరితిత్తుల పనితీరు, ఎకో, ఈసీజీ వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశామని తెలిపారు. ఈనెల 16వ తేదీన కంటి పరీక్షలు నిర్వహించిన వారిలో అవసరమైన 135 మందికి ఉచితంగా కళ్లజోళ్లను అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు కొప్పుల మరియమ్మ, రావ్ బాండ్స్ ఆఫ్ లవ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

బాణసంచా షాపులకు నోటీసులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలో వున్న బాణసంచా షాపులకు ఆదివారం తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజ్ నోటీసులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఈ నోటీసులు అందజేస్తున్నామని, జూన్ 4వ తేదీ వెలువడే పార్లమెంట్, అసెంబ్లీ ఫలితాలు రానున్నాయని, ఆ సందర్భంగా బాణసంచా పెద్ద మొత్తంలో అమ్మకూడదని ఎన్నికల కమిషన్ ఆదేశించిందని, దానిలో భాగంగా ఉండవల్లిలో వున్న హోల్‌సేల్ బాణసంచా దుకాణాలకు ఈ నోటీసులు అందజేశామని, జూన్ 4వ తేదీ పోలీసుల అనుమతి లేకుండా ఎవరూ ర్యాలీలు, ఇతర కార్యక్రమాలు నిర్వహించకూడదని, పెట్రోల్ బంకుల వారు పెట్రోల్,డీ జిల్‌ను క్యానుల్లో, బాటిళ్లలో అమ్మకూడదని ఆయన సూచించారు.

ప్రశాంత వాతావరణంలో కౌంటింగ్

చేబ్రోలు: సార్వత్రిక ఎన్నికల ఫలితాల తర్వాత ప్రజలు గొడవలు లేకుండా ప్రశాంతంగా ఉండాలని చేబ్రోలు ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ అన్నారు. మండలంలోని వేజండ్ల, నారాకోడూరు తదితర గ్రామాల్లో ఆదివారం రాత్రి స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున, తర్వాత ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రశాంత వాతవరణం కొనసాగించాలని సూచించారు. మండల పరిధిలోని మంచాల, చేబ్రోలు, నారాకోడూరు, వేజండ్ల, వడ్లమూడి, గ్రామాల పరిధిలోని పెట్రోలు బంకు యజమానులకు డబ్బాలు, బాటిల్స్, విడిగా ఇతర వస్తువులలో పెట్రోలును నింపి విక్రయాలు చేయవద్దని ఆదేశించారు. బంకు యజమానులకు నోటీసులు అందజేశారు. కొత్త ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు కేవలం వాహనదారులకు మాత్రమే పెట్రోలు, డీజిల్‌ను నింపాలని సూచించారు. ఉత్తర్వులు ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవటం జరుగుతుందని ఎస్‌ఐ పి.మహేష్ కుమార్ హెచ్చరించారు.

వివాదాలకు దూరంగా ఉండాలి

కాకుమాను: ప్రస్తుతం గ్రామాల్లో ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉండాలని ఎస్‌ఐ ఎస్.రవీంద్ర అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆదివారం మండలంలోని రౌడీ షీటర్ల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీ షీట్ ఉన్న ప్రతి ఒక్కరూ వివాదాలకు దూరంగా ఉంటూ మంచి ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. షీట్ ఉన్న ప్రతి ఒక్కరిపై ప్రతి రోజు కట్టుదిట్టమైన నిఘా పెట్టినట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సత్ప్రవర్తన కలిగి ఉంటే కొంత కాలానికి షీటు తీసే అవకాశాలు ఉన్నాయని, ప్రతి ఒక్కరూ దీనిని గమనించి మసులుకోవాలని స్పష్టం చేశారు.

రంగస్థల నటుడు సాంబయ్యకు జీవిత సాఫల్య పురస్కారం

- కథానాటిక/స్వీయ రచనల పోటీల విజేతలకు బహుమతులు
- ముగిసిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికల పోటీలు



నూతలపాటి సాంబయ్యకు జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం

తెనాలి: రూరల్ మండలం కొలకలూరులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆహ్వాన నాటికల పోటీల ముగింపు సభలో సత్తెనపల్లికి చెందిన ప్రముఖ రంగస్థల నటుడు, దర్శకుడు, గుణనిర్దేశ నూతలపాటి సాంబయ్యకు దివంగత గోపరాజు వెంకట శివరామ సుబ్రహ్మణ్యశర్మ జీవిత సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు. కొలంకపురి నాటక కళాపరిషత్, కొలకలూరు, వైకే నాటక కళాపరిషత్, హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీలు ఆదివారం రాత్రి ముగిశాయి. బహుమతి ప్రదానం అనంతరం జీవన సాఫల్య పురస్కారాన్ని ప్రదానోత్సవం నిర్వహించారు. తొలుత చలసాని కృష్ణప్రసాద్, తాళ్లూరు సత్యనారాయణ జ్యోతి ప్రజ్వలన చేశారు. సభకు పిన్నమనేని మృత్యుంజయరావు అధ్యక్షత వహించారు.

కథానాటికల పోటీల విజేతలకు...

తెలుగు కళాసమితి, విశాఖపట్నం నిర్వహించిన కథానాటిక/ స్వీయరచనల పోటీల్లో విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. ప్రథమ బహుమతి 'ఆకాశంలో ఒక నక్షత్రం'(రచయిత: వంశీ మట్టా), ద్వితీయ బహుమతి 'చిటికెన వేలు' (అట్టాడ అప్పలనాయుడు), తృతీయ బహుమతి 'యత్ర నార్యస్తు పూజ్యంతే' (పాణ్యం దత్త శర్మ)కు అందజేశారు. 'చేతులు కాలాక' (పెండ్యాల గాయత్రి), 'తరంగిణి' (తులసి బాలకృష్ణ), 'బంధాల బందిఖానా'(పీటీ మాధవ్), 'స్వేదఫలం'(వల్లూరు శివప్రసాద్), 'సయ్యాట'(స్నిగ్ధ)కు జ్యూరీ బహుమతులను అందజేశారు. ఈ రచనల పోటీలకు చలసాని కృష్ణప్రసాద్, వైఎస్‌కేఎస్ స్వామి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు.

సాంఘిక నాటక/ నాటికల పోటీల విజేతలకు...

ఇదే వేదికపై కొలంకపురి నాటక కళాపరిషత్, శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు సంయుక్త నిర్వహణలో జరిపిన రాష్ట్ర స్థాయి సాంఘిక నాటక, సాంఘిక నాటికల పోటీల విజేతలకు నగదు బహుమతులను అందజేసి సత్కరించారు. సాంఘిక నాటకం విభాగంలో ప్రథమ బహుమతి '27వ మైలురాయి' (పీటీ మాధవ్)కు లభించింది. ద్వితీయ బహుమతి 'నెత్తురు' (కేవీవీ సత్యనారాయణ), సాంఘిక నాటికల విభాగంలో.. ప్రథమ బహుమతిని 'వాన'ప్రస్థానం' (సీహెచ్ సింహప్రసాద్) గెలుచుకోగా, 'మా యింట్లో మహాభారతం' (మద్దుకూరి రవీంద్రబాబు)కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ పోటీలకు న్యాయనిర్ణేతలుగా కేవీ బలరామమూర్తి, భట్టిప్రోడి శ్రీనివాస సుబ్బారావు వ్యవహరించారు.

ప్రత్యేక నాటిక ప్రదర్శన...

సభానంతరం శ్రీసాయి ఆర్ట్స్, కొలకలూరు వారి 'కౌసల్యా సుప్రజారామ' నాటికను ప్రత్యేకంగా ప్రదర్శించారు. ఆకెళ్ల శివప్రసాద్ మూలకథను స్నిగ్ధ నాటికీకరించగా, గోపరాజు విజయ్ దర్శకత్వం వహించారు. సభలో ప్రముఖ సినీమాటల రచయిత సాయిమాధవ్ బుర్రా, రంగస్థల ప్రముఖులు ఆకురాతి భాస్కర్‌చంద్ర, కేవీ బలరామమూర్తి, నాటక పరిశోధకుడు డాక్టర్ కందిమళ్ల సాంబశివరావు, పురుషోత్తమరావు, భారతుల ఫణి, పరిషత్ బాధ్యులు లోకం సూర్యనారాయణ, సుంకర శ్రీనివాసరావు మాట్లాడారు.

ప్రశాంత పరిస్థితులకు సహకరించండి

- తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్
- నిడుముక్కలలో ఇరువర్గాలతో శాంతి కమిటీ సమావేశం

నిడుముక్కల(తాడికొండ): ప్రజలు తాత్కాలిక ఆవేశాలకు లోను కాకుండా శాంతియుతంగా వ్యవహరిస్తే గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడతాయని, దీనికి అందరూ సహకరించాలని తుళ్లూరు డీఎస్పీ ఇ.అశోక్ గౌడ్ సూచించారు. తాడికొండ మండలం నిడుముక్కల గ్రామంలో ఎన్నికల సందర్భంగా జరిగిన వివాదాల నేపథ్యంలో పోలీసు పికెటింగ్ కొనసాగుతుంది. ఆదివారం డీఎస్పీ అధ్యక్షతన గ్రామంలోని ఇరు వర్గాలతో పోలీసు పికెటింగ్ నిర్వహించి శాంతి కమిటీ ఏర్పాటుకు ప్రతిపాదించారు. అయితే ఇరు వర్గాలు కమిటీ నిర్వహణకు తమకు కొంత సమయం కావాలని కోరడంతో త్వరలో మళ్లీ సమావేశం ఏర్పాటు చేస్తామని, అప్పట్లోగా అందరూ సంసిద్ధంగా ఉండాలని డీఎస్పీ సూచించారు. ప్రజలకు తగిన సేవలందించేందుకే పోలీసు శాఖ ఉందని, సమస్యలు, ఇబ్బందులు ఏమైనా ఎదురైతే తమ దృష్టికి తీసుకొస్తే సత్వరం పరిష్కరిస్తామన్నారు. సొంత నిర్ణయాలతో ముందుకెళ్లి వివాదాస్పద పరిస్థితులకు అవకాశం కల్పించకుండా, గ్రామంలో ప్రశాంత పరిస్థితులు ఏర్పడేందుకు సహకరించాలన్నారు. అనంతరం పోలీసు బలగాలతో గ్రామంలో కవాతు నిర్వహించి సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు. సీఐ సీహెచ్ ప్రభాకర్, ఎస్‌ఐలు రవీందర్, అంజయ్య పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పాప ప్రక్షాళనతోనే శాంతి



వాక్యోపదేశం చేస్తున్న విచారణ గురువు పి.బాలస్వామి

ఫిరంగిపురం: పాపప్రక్షాళన చేసుకోవడం ద్వారానే మానవుడు శాంతిని పొందుతాడని విచారణ గురువులు పి.బాలస్వామి అన్నారు. మండలకేంద్రంలోని బాల ఏసుదేవాలయంలో పెంతికోస్తు ఆదివారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బాలస్వామి వాక్యోపదేశం చేస్తూ భగవంతుడు మొట్టమొదటగా మట్టితో మానవుని తయారు చేసి, శ్వాసను ఊది జీవం పోశాడని చెప్పారు. భగవంతుడిచే సృష్టించబడిన మానవుడు తన జీవనాన్ని సాగిస్తూ దేవుడి ఆజ్ఞలకు వ్యతిరేకంగా జీవిస్తాడో అతడు మృతిచెందినవాడితో సమానమని తెలిపారు. భగవంతుడు అందించిన జీవాన్ని పదిలంగా ఉంచుకోవాలంటే హృదయప్రక్షాళన అవసరమన్నారు. మనలోని కల్మషాలను తీసివేసి పరిశుద్ధంగా ఉంచుకొని భగవంతుని ప్రార్థించినప్పుడు జీవితానికి సార్థకత చేకూరుతుందని తెలిపారు. హృదయ శుద్ధి కలిగినవారు భగవంతుని దర్శనాన్ని పొందుతారని చెప్పారు. ప్రతి మానవుడు జీవితంలో ఎన్నో తప్పులు చేస్తాడని కాని ఎవరైతే తన తప్పులు తెలుసుకొని పశ్చాత్తాపం పొంది మారు మనస్సుతో భగవంతుడిని ప్రార్థిస్తారో వారిపై ఆయన కృప లభిస్తుందన్నారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. సహాయ విచారణ గురువు ఆర్.అనిల్‌కుమార్, ఫాదర్ విలియమ్స్, కథోలిక క్రైస్తవులు, మఠకన్యలు, గుడిపెద్దలు పాల్గొన్నారు.

చదువులమ్మ గుడిలో.. జ్ఞాపకాల ఒడిలో..



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

- 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న స్నేహితులు
- సీకే బాలుర హైస్కూల్‌లో ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

మంగళగిరి: పలకరింపులు.. జ్ఞాపకాల దొంతరలో.. కాలంలో పయనించి అప్పటి సంగతుల గురించి ముచ్చట్లు.. ఆనందాలు.. భావోద్వేగాలు.. ఇదీ పట్టణంలో సీకే బాలుర ఉన్నత పాఠశాలలో కనిపించిన సన్నివేశం. పాఠశాలలో 1994 నుంచి 1999 వరకు చదువుకున్న విద్యార్థులంతా ఆదివారం సమావేశమయ్యారు. 25 యేళ్ల క్రితం చదువులమ్మ ఒడిలో తాము గడిపిన మధుర జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఉల్లాసంగా ఉత్సాహం గడిపారు. వివిధ ప్రాంతాల్లో వున్నవారంతా హాజరై తమ చిన్న నాటి స్నేహితులకు కలుసుకుని.. తమ హోదాలను, స్థాయిలను మరచి చిన్న పిల్లల్లా అల్లరి చేసి ఆటలు ఆడి పాటలు పాడి ఉత్సాహంగా గడిపారు. తాము చిన్నతనంలో చేసిన అల్లర్లు, చిలిపితనాలు గుర్తుకు తెచ్చుకుని తమకు విద్యను అందించి గొప్పవారిని చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. మృతి చెందిన ఉపాధ్యాయుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సాంస్కృతిక కార్యక్రమాలు చేసిన చిన్నారులకు ఘనంగా సత్కరించారు. మాజీ ప్రిన్సిపాల్ మందా విజయ్ రామ్మోహన్‌రావు, పూర్వ విద్యార్థులు రేఖా నరేష్, పూర్వ ఉపాధ్యాయులు జంజనం పాండురంగారావు, దామర్ల కనక లింగేశ్వరరావు, అత్తోట రత్నబాబు, గోలి యోగేశ్వరరావు, గద్దె నరసింహారావు, రావుల సైదులు, కోర అమ్మాజీ, తుమ్మ నాగేశ్వరరావు, కాట్రు రామారావు, ఎస్.రామ్ హనుమాన్, పంచల సాంబశివరావు, పూర్వ విద్యార్థులు జంజనం సతీష్, మద్దెల కిషోర్, నక్కా శంకర్‌బాబు, దాన్ బాషా తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు కృత్రిమ చేతుల పంపిణీ ప్రారంభం

- దేశంలోనే ప్రప్రథమంగా చేపట్టిన రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి
- పాల్గొననున్న జర్మనీ, న్యూజిల్యాండ్, ఆఫ్రికా టెక్నీషియన్లు



కృత్రిమ చేతితో రాస్తున్న విద్యార్థి (ఫైల్)

మంగళగిరి: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. 240 మందికి సోమవారం పట్టణంలోని వీటీజేఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాలలో కృత్రిమ చేతులు పంపిణీ చేయనున్నట్లు రోటరీ క్లబ్ ప్రతినిధి ఇసునూరి అనిల్ చక్రవర్తి ఆదివారం తెలిపారు. రూ.1.35 కోట్లతో 240 మందికి కృత్రిమ చేతులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. జర్మనీ దేశం నుంచి కృత్రిమ చేతులను దిగుమతి చేసుకున్నామన్నారు. పంపిణీ కార్యక్రమంలో జర్మనీ, న్యూజిల్యాండ్, ఆఫ్రికా నుంచి వచ్చిన టెక్నీషియన్లు పాల్గొని కృత్రిమ చేతుల వాడే విధానాన్ని బాధితులకు వివరించనున్నట్లు తెలిపారు. దేశంలోనే ప్రప్రథమంగా కృత్రిమ చేతుల పంపిణీ కార్యక్రమం చేపట్టామన్నారు.

గంజాయి మత్తు..యువత చిత్తు

అంధకారంగా భవిష్యత్తు



గంజాయి బాబులకు అడ్డాగా మారిన నిర్మానుష్య ప్రదేశాలు

పెదకాకాని: గంజాయి మత్తులో యువత జీవితాలు చిత్తు అవుతోంది. మత్తుకు బానిసలుగా మారి భవిష్యత్తు అంధకారం చేసుకుంటున్నారు. డిగ్రీలు చదివి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాల్సిన.. భావితరం వెర్రి తలలు వేసి మత్తులో జోగుతోంది. పుస్తకాల బ్యాగులతో కళాశాలలకు వెళ్తున్న వారిలో పలువురు యువకులు తరగతులకు డుమ్మా కొట్టి నిర్మానుష్య ప్రాంతాల్లో గంజాయి గుప్పుమనిపిస్తున్నారు. ఈ గంజాయి ఒక్కో ప్రాంతంలో షార్ట్ కట్‌లో ఒక్కో పేరుతో పిలుస్తూ పక్క వారికి తెలియకుండా జాగ్రత్త పడుతున్నారు. ముఖ్యంగా నంబూరు వీవీఐటీ కళాశాల రోడ్డు, పెదకాకాని భ్రమరాంబపురం, రైల్వే ట్రాక్, గోరంట్ల పొలిమేర వంటి ముళ్ల పొదలు, నిర్మానుష్య ప్రాంతాలకు చేరుతున్నారు. నలుగురు యువకులు ఒక చోటకు చేరడం సిగరెట్‌లో గంజాయి నింపి గుప్పుమనిపిస్తుంటే.. మరికొందరు లిక్విడ్ రూపంలో ఉన్న మత్తు పదార్థాన్ని ప్లాస్టిక్ సోడా బాటిళ్లలో నింపి దానికి ఏర్పాటు చేసిన రంధ్రం గుండా పీల్చడానికి గొట్టం మాదిరిగా ఏర్పాటు చేసుకుని ఆస్వాదిస్తున్నారు. ఈ మత్తులో తూగుతున్న యువత పలు సందర్భాల్లో విచక్షణ కోల్పోయి పలు ఘర్షణలకు కారణమవుతున్నారు. ప్రజలను కూడా భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. ఈ మత్తు పదార్థాల విక్రయాలు పెదకాకాని మండలంలోని పెదకాకాని, ఉప్పలపాడు, నంబూరు గ్రామాల్లో విక్రయిస్తూ పలువురు సొమ్ము చేసుకుంటున్నారు. యువత భవిష్యత్తును నాశనం చేస్తున్నారు. ఈ గంజాయి మత్తు పదార్థాల కారణంగా ఎంతో ఘనంగా జరిపించిన పెళ్ళిళ్ళు కూడా మూన్నాళ్ల ముచ్చటగా ముక్కలవుతున్నాయి. అదుపు చేయాల్సిన పోలీసు సిబ్బంది చోద్యం చూస్తున్నారు. గంజాయి కేసులు కూడా మొక్కుబడిగానే నమోదు అవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గంజాయి సరఫరా చేస్తున్న వారిపై నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులు, మండల ప్రజలు కోరుతున్నారు.



భ్రమరాంబపురం కాలనీలో ద్రవ రూపంలో గంజాయిని పీల్చి వదిలిన ప్లాస్టిక్ బాటిళ్లు

పోరాట యోధుడు 'పుచ్చలపల్లి'

తాడేపల్లిలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సభ



గుండిమెడలో పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు



సుందరయ్య వర్ధంతి సభలో ప్రసంగిస్తున్న సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య

తాడేపల్లిరూరల్: అలుపెరుగని పోరాట యోధుడు, తొలి పార్లమెంట్ ప్రతిపక్ష నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య అన్నారు. ఆదివారం పుచ్చలపల్లి సుందయ్య వర్ధంతి కార్యక్రమాన్ని తాడేపల్లి పట్టణ పరిధిలోని మేకా అమారెడ్డి భవన్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సుందరయ్య గొప్ప ఆచరణ వాదని, తాను నమ్మిన సిద్ధాంతం కోసం చివరి వరకు నిలబడిన వ్యక్తి అని, భూస్వాముల కుటుంబంలో పుట్టినా, నిత్యం పేదల కోసం, వ్యవసాయ కార్మికుల కోసం పనిచేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సీనియర్ నాయకులు జొన్నా శివశంకరరావు, తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, పట్టణ కార్యదర్శి బూరగ వెంకటేశ్వర్లు, ఐద్వా నాయకులు దొంతిరెడ్డి శ్రీనివాసకుమారి, నాయకులు గాదె సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుండిమెడలో...

తాడేపల్లి రూరల్‌పరిధిలోని గుండిమెడలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాలను తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తాడేపల్లి మండల నాయకులు పల్లె కృష్ణ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ముందుగా పుచ్చలపల్లి సుందయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం నాయకులు జొన్నా శివశంకరరావు, వెంకటరెడ్డి మాట్లాడుతూ తాడిత పీడిత ప్రజల కోసం నిరంతరం పోరాటం నడిపిన ధన్యజీవి సుందరయ్య అని, చౌకధరల డిపోల ద్వారా పేదలకు సరకులు అందించాలని ఆనాడే నినదించారని, కుల రహిత సమాజం కావాలని, తన పేరుని మార్చుకున్న సుందరయ్య గొప్ప నాయకుడు అని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటాన్ని ముందుండి నడిపిన సుందరయ్య ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్)ని దేశవ్యాప్తంగా వ్యాపింప చేసిన మహా ఉద్యమనేత అని అన్నారు. సీపీఎం తాడేపల్లి మండల నాయకులు కంచర్ల సాంబశివరావు, బత్తుల సంసోను, చిన్ని మరియదాసు, మోజెస్, సీపీఎం పట్టణ నాయకులు బి.గోపిరెడ్డి, ఎం.బుల్లిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొలనుకొండలో...

తాడేపల్లిరూరల్: దక్షిణ భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమ నేత, కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమాన్ని మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని కొలనుకొండలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సీపీఎం తాడేపల్లి మండల సీనియర్ నాయకుల జొన్నా శివశంకరరావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా ప్రజా సమస్యలపై అలుపెరుగని పోరాటం నడిపిన అనేక ఉద్యమాలలో సుందరయ్య పాత్ర మరువలేనిదని, చిన్న తనం నుంచి పేదలు, దళితులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపైన, భూస్వాములకు ఎదురు తిరిగి పోరాటం చేశారని అన్నారు. సీఐటీయూ నాయ కులు కూరపాటి స్టీవెన్, సీపీఎం తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కొలనుకొండ గ్రామ శాఖ కార్యదర్శి శివన్నారాయణ, శ్రీనివాసరావు, బి.గోపిరెడ్డి, అరుమళ్ళ నాగిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా నీలం సంజీవరెడ్డి జయంతి వేడుకలు



తాడేపల్లిరూరల్: భారత మాజీ రాష్ట్రపతి డాక్టర్ నీలం సంజీవరెడ్డి 111వ జయంతి వేడుకలను ఎంటీఎంసీ పరిధిలోని రామచంద్రాపురంలో నీలం సంజీవరెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తొలుత నీలం సంజీవరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయానికి నీలం సంజీవరెడ్డి సచివాలయం అని నామకరణం చేయాలని కోరుతున్నామన్నారు.

వైభవంగా చౌడేశ్వరిదేవి జ్యోతుల మహోత్సవం



తక్కెళ్ళపాడు గ్రామంలో కోలాహలంగా చౌడేశ్వరి అమ్మవారి గ్రామోత్సవం



గ్రామోత్సవంలో చౌడేశ్వరి అమ్మవారు

పెదకాకాని: శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారి జ్యోతుల మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. మండలంలోని తక్కెళ్ళపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏటా జ్యోతులతో గ్రామోత్సవం నిర్వహిస్తారు. ఈ ఏడాది 16 జ్యోతులతో శనివారం రాత్రి 12 గంటల నుంచి ఆదివారం ఉదయం 10 గంటల వరకూ గ్రామోత్సవం జరిగింది. ఈ అమ్మవారి జ్యోతుల ప్రదర్శన మహోత్సవాన్ని పురస్కరించుకుని గ్రామానికి చెందిన ఆడపడుచులు, బంధుమిత్రులు స్వగ్రామానికి చేరుకున్నారు. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. పొంగలి నైవేద్యాలు సమర్పించారు. మంగళ వాయిద్యాలతో తొగట వీరులు కత్తులు, నారజములు, పసుపు కొమ్ములతో జలది దగ్గరకు వెళ్లి బండారు కొట్టుట జరిగింది. రాత్రి 10 గంటలకు జ్యోతుల తయారు చేసి మేళ తాళాలు, భజనలు, తీన్‌మార్ డప్పుల నడుమ గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. రాత్రంతా జ్యోతుల ప్రదర్శనతో వైభవంగా జరిగింది. గ్రామోత్సవాన్ని ప్రజలు ఆహ్వానించి శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి స్వాగతం పలికారు. రాత్రంతా జ్యోతుల జాతర చోటు చేసుకుంది. ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. పూజా కార్యక్రమాల అనంతరం వేలాదిగా తరలివచ్చిన భక్తులందరికీ అన్న సంతర్పణ చేశారు.

ఆయుర్వేద వైద్య ఉచిత శిబిరం



గుంటూరు రూరల్: ఆయుర్వేద వైద్యం ద్వారా దీర్ఘకాలిక వ్యాధులు త్వరితగతిన నయమవుతాయని శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు తెలిపారు. ఆదివారం నగర శివారులోని ఇన్నర్ రింగ్‌రోడ్డు సమీపంలో ఉన్న శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేదిక్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎంతో పురాతనమైన వైద్యంలో ఆయుర్వేద వైద్యం ప్రఖ్యాతిగాంచిందన్నారు. ఎటువంటి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా వైద్యం అందజేస్తున్నామన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో 100 పడకలతో ఆయుర్వేద వైద్యం అందిస్తున్నామని తెలిపారు. అనంతరం సుమారు 300 మందికి పరీక్షలు నిర్వహించి, అర్హులకు రూ.60 వేలు విలువైన మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది, వైద్యులు పాల్గొన్నారు.